క్లుప్తంగా

ఘనంగా దొడ్డి దేవర


గంగమ్మకు బోనాలు సమర్పించిన గ్రామస్తులు

తొండూరు: మండల కేంద్రమైన తొండూరులో గ్రామస్తులు దొడ్డిదేవరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి యాదవులు రకరకాల రంగులతో వేసిన ముగ్గులపై తమ పశువులను దాటించారు. అలాగే తెల్లవారు జాము నుంచి గ్రామంలోని గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దొడ్డి గంగమ్మ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం బంధువులు, స్నేహితులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

ముగిసిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : జాతీయ విద్యా విధానం 4వ వార్షికోత్సవం సందర్భంగా శిక్షా సప్తాహ్ పేరుతో కేంద్రం ప్రభుత్వం వారం రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రామునాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెద్దముడియం: పెద్దపసుపుల గ్రామంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు మేడిదిన్నె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ మరియు గ్రూపింగ్ రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రక్త హీనత, డయేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సోము వెంకటరమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాజనేయరెడ్డి తెలిపారు. ఈ నెల 26, 27 తేదీల్లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ సబ్ జూనియర్ విభాగం పోటీలలో 8వ తరగతి చదువుతున్న తన్వీష్ సాయి, నాదెండ్ల చర్మిష్మా 30 సెకండ్ల స్కిప్పింగ్‌లో ద్వితీయ స్థానంలో, షేక్ యాస్మీన్, వెన్నెల 3 నిమిషాల స్కిప్పింగ్‌లో తృతీయ స్థానంలో గెలిపొందారని పేర్కొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు


ఆలయ హుండీని లెక్కిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట బొగ్గులేటిపల్లి సరిహద్దులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయాన్ని ఆలయ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయఈఓ సురేష్ కుమార్ రెడ్డి. ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ మాట్లాడుతూ ఆలయ హుండీ ఆదాయం ఒక నెలకు సంబంధించి రూ. 1,73,779 వచ్చినట్లు తెలిపారు. చింతకొమ్మదిన్నె సర్పంచ్ కంది మహేశ్వర్‌రెడ్డి. మాజీ ఆలయ చైర్మన్ శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

వైవీయూ : ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే తిప్పలే

- వాహనదారులకు అధికారులు హెచ్చరిక
- లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వద్దు
- ప్రమాదాలు సంభవిస్తే ప్రభుత్వ పథకాలు వర్తించవు

పులివెందుల రూరల్: డ్రైవింగ్ లైసెన్సే కదా తీసుకుందాంలే అన్న నిర్లక్ష్యం చిక్కుల్లోకి నెడుతుందని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత కాలంలో చాలామంది యువకులు లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదవశాత్తు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో పాటు కఠిన శిక్ష పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచిస్తున్నారు.

దరఖాస్తు విధానం

డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తును సమర్పించే విధానం మారదు. అయితే, కొత్త డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అవసరమైన పత్రాలను మంత్రిత్వ శాఖ సులభతరం చేసింది. అభ్యర్థులు ఏ వాహనానికై తే లైసెన్స్ తీసుకుంటారో దానిపైనే ధృవపత్రాల భారం తగ్గుతుంది.

సేవలు సులభతరం

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, ఎల్‌ఎల్‌ఆర్ అనుమతి పత్రాలు మంజూరు చేయడానికి ప్రభుత్వ రవాణా సేవలను సులభతరం చేసింది. గతంలో ప్రజల ముంగిట రవాణాశాఖ పేరుతో మేళా కార్యక్రమాలు నిర్వహించేవారు. రవాణాశాఖ అధికారులు ప్రతి ఏడాది కళాశాలలకు వెళ్లి ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించేవారు. ఎల్‌ఎల్‌ఆర్ కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మీసేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. స్లాట్ ప్రకారం పరీక్షలో ఉత్తీర్ణులైన వారు వాహనాలు నడిపే అనుమతులను పొందవచ్చు.

అరకొర డ్రైవింగ్‌తో రోడ్డెక్కుతున్నారు

ప్రస్తుత కాలంలో ప్రతి ఇంటిలో రెండు లేదా మూడు వాహనాలు ఉన్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాహనాదారులు రహదారి నిబంధనలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. చాలా మంది వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందేందుకు కంప్యూటర్‌పై అవగాహన లేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత కాలంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం అందించే ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు అందదు.


మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాక్

నిర్లక్ష్యం తగదు


వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. లైసెన్స్ తీసుకునే విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం. డ్రైవింగ్‌లో పూర్తిస్థాయిలో శిక్షణ తీసుకోవాలి. లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకుని స్లాట్ బుక్ చేసుకొని ఎల్‌ఎల్‌ఆర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వాహనాలు నడిపి లైసెన్స్ పొందాలి.

- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ప్రసాద్

లైసెన్స్ తప్పనిసరి


వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రమాదాలు సంభవించినప్పుడు వాహనదారుడికి లైసెన్స్ లేకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించవు. ప్రభుత్వ పథకాలు భాదిత కుటుంబానికి ఆసరాగా నిలుస్తాయి.

- రాముడు, వాహనదారుడు

లైసెన్స్‌తో అనేక ప్రయోజనాలు


ద్విచక్ర, పోర్ వీలర్ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. లైసెన్స్ వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయి. లైసెన్స్ లేకపోవడం వలన ప్రమాదాలు జరిగితే ప్రమాద బీమా బాధిత కుటుంబాలకు వర్తించదు. క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందవు. అందువల్ల లైసెన్స్‌లు తీసుకోవాలి.

- నరేంద్ర, వాహనదారుడు

పంటల సాగుపై అవగాహన


మాట్లాడుతున్న ఏఓ ఓబులేసు

పెండ్లిమర్రి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటల సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారి ఓబులేసు ఆదేశించారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి వివరించాలన్నారు. పీఎం కిషాన్‌కు ఈకేవైసీ తప్పని సరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, ఈసీ నాగమల్లేశ్వరమ్మ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని చెమ్ముమియాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) విద్యార్థులు జిల్లాస్థాయి యోగా పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజా, ఫిజికల్ డైరెక్టర్ ఎం. ప్రవీణ్‌కిరణ్ తెలిపారు. ఆదివారం కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగ కాంపిటీషన్‌లో గురువిష్ణు స్వర్ణం, శివకేశవ రజతం, మల్లికార్జున, బన్నీలు కాంస్యపతకాలు సాధించినట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు తిథి భోజనాలు


వేంపల్లె: విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు, పూర్వపు విద్యార్థులు


పులివెందుల టౌన్: విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయురాలు ఉష

వేంపల్లె: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ తెలిపారు. సోమవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 1979వ సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు, అదే పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని కలిసి విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యను లక్ష్యంతో చదివినప్పుడే మంచి ఫలితాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి పూర్వ విద్యార్థులు విశ్వనాథరెడ్డి, సత్యం, భాస్కర్, అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు

పెద్దముడియం: మండలంలోని పెద్దపసుపుల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చదివిన 1972–77 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులందరూ కలిసి విద్యార్థులకు సోమవారం రోజు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.పుల్లారెడ్డి, నారాయణరెడ్డి, శేషయ్య, సుధాకర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపీపీఎస్ (అహోబిలాపురం) ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గోటూరు ఉష విద్యార్థులకు పాయసం, అన్నం, పప్పు, అరటిపండుతో కూడిన భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈఓ చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు ఉషను అభినందించారు. పాఠశాలలో చదివే పేద పిల్లలకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని ఉష పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శ్రావణ మాస ఉత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆవిష్కరించారు. పులివెందులలో ఆలయ అధికారి వెంకట సుబ్బయ్య, ప్రధాన అర్చకుడు కేసరిస్వామి వారిని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి సూచించారు. సోమవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సాంకేతిక కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి పురోగతిపై చర్చించారు. కేవీకే ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్, శాస్త్రవేత్తలు శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సులైన ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 30 రోజులపాటు అందించే శిక్షణకు 18–45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులైన వారు ఫోన్ నంబర్లు :94409 05478, 99856 06866, 94409 33028 లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రేషన్ షాపుల ప్రారంభం

కడప రూరల్ : కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి సోమవారం కడప నగరంలో పలు కార్యక్రమాల్లో బిజీగా గడిపారు. మేకలదొడ్డి, రామాంజనేయపురం, చలమారెడ్డిపల్లె, ఆర్కేనగర్‌లో రేషన్ షాపులను ప్రారంభించారు. మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకంలో పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టిపెట్టండి

మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ వీసీ హాల్‌లో సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, హెల్త్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు అడ్మిన్ సెక్రటరీలు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి ఉంచి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అలాగే వెల్ఫేర్ సెక్రటరీలు ప్రతి నెల 1వ తేదీన జరిగే సామాజిక భద్రతా ఫించన్ పంపిణీ కార్యక్రమాన్ని తెల్లవారు జామునే ప్రారంభించాలని సూచించారు. హెల్త్ సెక్రటరీలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని కోరారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ మురళీధర్, రెవెన్యూ అధికారి మునికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు


ఎర్రగుంట్ల : తహసీల్దార్ సౌజన్యలక్ష్మిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల తహసీల్దార్ సౌజన్యలక్ష్మి బదిలీ అయిన సందర్భంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికలను సజావుగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తేజస్విని, డీటీ రమణారెడ్డితో పాటు ఆర్‌ఐ, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఆపరేటర్లు పాల్గొన్నారు.


సింహాద్రిపురం: తహశీల్దార్ భీమేశ్వరరావును సన్మానిస్తున్న కార్యాలయి సిబ్బంది

తహసీల్దార్‌కు సన్మానం

సింహాద్రిపురం: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న భీమేశ్వరరావు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా నుంచి బదిలీపై సింహాద్రిపురం వచ్చిన భీమేశ్వరరావు మళ్లీ సొంత జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ షేక్షా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

కమలాపురం: రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి సరస్వతి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలను కాపాడు కోవడానికి సస్యరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. సోమవారం ఆమె మండల పరిధిలోని సంబటూరు, కోగటం గ్రామాల్లో సాగు చేసిన మినుము, పత్తి తదితర పలు రకాల పంటలను ఆమె పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు బెట్టకు గురికావడం జరిగిందన్నారు. బెట్ట పరిస్థితిని తట్టుకునేందుకు లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా లేదా 5 గ్రాములు 19–19–19 లేదా పంట పూత దశలో ఉన్నట్లయితే 10 గ్రాముల చొప్పున 13–0–45ను కలిపి పిచికారీ చేసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. మినుము పంటకు రసం పీల్చే పురుగులు ఆశించాయని, వాటి నివారణకు ఇమిడ క్లోప్రిడ్ 0.4 మి.లీ. మరియు పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు ప్రోఫినోపాస్ 2 మి.లీ. లేదా అసిఫట్ 1.5 గ్రాములు పిచికారీ చేసి 15 రోజుల తర్వాత 2 మీ.లీ. లేదా డైఫన్ దియురాన్ 1.25 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆమె రైతులకు వివరించారు.


కోగటం గ్రామ పొలాల్లో పంటను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

వరుణ దేవా కరుణించవా..!


సాగు చేసిన భూమి

పులివెందుల రూరల్: వరుణ దేవా కరుణించవా అంటూ వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వరుణుడు కరునించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఎప్పుడు కురుస్తాయోనని మేఘాల వైపు ఆశగా చూస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు పడకపోతే పంటలు ఎందుకు పనికిరాకుండా పోతాయని అన్నదాత ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. సకాలంలో వర్షాలు పడితే పంటలు పండే అవకాశం లేదు. కొన్ని గ్రామాల్లో వర్షాలు పడాలని ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పులివెందుల రూరల్ : ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని ఆయన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు. వినతులను స్వీకరించి సమస్యలు పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పలు శాఖల అధికారులు ఆయనను కలిసి పలు విషయాలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను వింటున్న రాంగోపాల్‌రెడ్డి

తెలుగు సాహిత్యానికి విశేష కృషి

చక్రాయపేట: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేశారని అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి కొనియాడారు. సోమవారం గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో గానుగపెంట హనుమంతరావును ఘనంగా సన్మానించారు. ఇంద్రకంటి ప్రసాదశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో గండి శ్రీవాసవీ నిత్యాన్నదాన సత్రంలో ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదశర్మ మాట్లాడుతూ సన్మాన గ్రహీతకు సంఘటిత సాహిత్య శిరోమణి, సాహిత్య సేవారత్న బిరుదులతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అఖిల భారత బ్రాహ్మణ మహా సంఘం రాష్ట్ర కోశాధికారి హనుమాన్ శాస్త్రి, ప్రముఖ పంచాంగ కర్త బుట్టే వీరభద్ర దైవజ్ఞ సిద్ధాంతి, సంస్కృత పండితుడు రంగాచార్యులు, చంద్రశేఖర్ కల్యాకర తదితరులు పాల్గొన్నారు.


గానుగపెంట హనుమంతరావును సత్కరిస్తున్న సాహితీవేత్తలు

లేత ‘చింత’.. ఆరోగ్యానికి లేదు చింత

- పోషకాలు అధికం
- చింత చిరుగుతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో..



సింహాద్రిపురం: చింతచెట్టు చిగురు చూడు..చిన్నదాని పొగరు చూడు..చింతచిగురు పుల్లగున్నదోయి...నా సామిరంగ చిన్నదేమో తియ్యగున్నదోయ్ అని ఓ సినీ కవి పడుచు పిల్లను చింత చిగురుతో పోల్చాడు. చింతచచ్చినా పులుపు చావలేదు... అన్న సామెత పల్లెల్లో తరుచూ వింటుంటాం. పులుపు సంగతి ఎలా ఉన్నా చింతచిగురు తినడం వలన ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. వర్షాకాలంలో చింత చెట్లకు చిగురు వస్తుంది. దీనికి మార్కెట్‌లో ఒక రేంజ్‌లో డిమాండ్ ఉంటుంది. దీని నుంచి కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు, ఏసీకే విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. ఇవన్నీ శరీరానికి చాలా అవసరం.

ప్రయోజనాలు పుష్కలం

ఇందులో విటమిన్ ‘ఎ’ కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుతూ, ఇమ్యూనిటీ పవర్‌ను బూస్ట్ చేస్తుంది. విటమిన్ ‘సి’ శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ రప్పిస్తుంది. విటమిన్ ‘కె’ ఎముకల ఆరోగ్యానికి, రక్తం గడ్డకట్టడానికి చాలా అవసరం. చింత చిగురులోని శుద్ధి చేసే గుణాలు కాలేయం పనితీరును ఇంప్రూవ్ చేస్తాయి. వీటిలోని సమ్మేళనాడు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. దీంతో గుండెజబ్బుల సమస్య తగ్గుతుంది. చింత చిగురులో నేచురల్ పెయిన్ కిల్లింగ్ ప్రాపర్టీస్ ఉంటాయి. ఇవి పీరియడ్ పెయిన్స్ నేచురల్‌గా తగ్గించగలవు. చింత చిగురుకు మధుమేహం లక్షణాలను తగ్గించే గుణాలు ఉన్నాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగకుండా ఆపుతాయి. కామెర్లను నయం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. చింతచిగురులోని యాంటీ–ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కీళ్లనొప్పులు, కీళ్ల వాతాన్ని తగ్గిస్తాయి. కీళ్ల వాపును నేచురల్‌గా దూరం చేస్తాయి. చింతచిగురు ఆకులతో తయారు చేసిన రసం తాగినా ఆరోగ్యానికి మంచిది. చింతచిరుగులో పోషకాలు అధికంగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు.